# జ్ఞాని

**ఎ.యస్.వి. ప్రసాద్**

గుళ్ళో గీతాపారాయణం జోరుగా సాగుతోంది.

"యే యథామాం ప్రపద్యన్తే
తాం స్తథైవభజామ్యహమ్
మమ వర్త్మాను వర్తన్తే
మనుష్యాః పార్థసర్వశః"

"చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవ అన్నట్లు ఎవరెవరు ఏ యే విధముగా ఎంతెంత భక్తితో ఏ యే రూపముతో తన్ను అర్చించుదురో లేక సేవించుదురో, వారిని ఆయా విధముగానే అనుగ్రహించెదనని భగవంతుడు చెప్పుచున్నాడు.

పరమాత్మ కల్పవృక్షము వంటివాడు. అతని చెంతకుఁబోయి ఏది వాంఛించిన దాని నొసంగును.

ఉత్తమ ఫలితములు ఎవ్వారికైన కల్గకున్నచో దోషము వారిదేగాని భగవంతువిది కాదు.

తృప్పుపట్టిన యినుమును సూదంటురాయి ఆకర్షించదు. అట్లే మనస్సునందు విషయ మాలిన్యము, దృశ్య దోషములు వున్నచో భగవంతుడు ఆకర్షింపబడడు.

కాబట్టి వారి వారి భక్తి ప్రపత్తుల తీవ్రతనుబట్టి సత్ఫలములను భగవానుడు వారికి కల్గజేయును."

శ్లోకానికి వ్యాఖ్య చదివి ఆ రోజుకి గీతా పారాయణకి వుద్వాసన చెప్పాడు గణాచారి.

హారతి వెలిగించి పళ్ళెం పట్టాడు.

భక్తులు పారవశ్యంతో కనక వర్షం కురిపించారు.

పళ్ళెంలో డబ్బును ఆశగా చూసుకున్నాడు గణాచారి.

* * *

ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకే స్వామివారి పూజా పునస్కారాలు పూర్తి చేసి గుడికి తాళం వేశాడు గణాచారి.

"స్వామీ! ఈ రోజు పవ్వళింపు సేవ వేగిరం చెయ్యవల్సి వచ్చింది క్షమించు" లెంపలు వేసుకుంటూ మంటపంలోకి వచ్చాడు.

పోలిగాడు టెంకాయతో ప్రత్యక్షమయ్యాడు. తాళం పెట్టివున్న గర్భగుడిని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏంటి సామీ! ఈరోజు చుక్క పొడవకుండానే మూశారు" అడిగాడు.

"ప్రతివాడు ప్రశ్నలడిగేవాడే. ప్రజాస్వామ్యం మరి! ఆఖరికి పోలిగాడికి కూడా తాను సంజాయిషీ యిచ్చుకోవాలి! మూఢుడు. మూఢుడు! విసుక్కున్నాడు గణాచారి.

"స్వామివారి పవ్వళింపు సేవకూడా అయిపోయింది. రేపొచ్చి ఆ టెంకాయ కొట్టు. మరేం కొంప మునగదు" అన్నాడు.

పోలిగాడు హతాశు డై పోయాడు.

"కాదు సామి. ఈరోజు శానాముఖ్యం. కొస్త గుడి తలుపులు తెరవండి. దేవుడికి మొక్కుకోవాలి" ప్రాధేయపడ్డాడు.

"ఏంటంత అర్జెంటు?" అడిగాడు గణాచారి.

"మా అబ్బాయికి పట్నంలో రేపు ఉద్యోగంకి సెలక్షన్. దేవుడికి దణ్ణం పెట్టాలి. టెంకాయ కొట్టి మొక్కు కట్టాలి" అన్నాడు పోలిగాడు.

"సరి సరి. స్వామివారు వుదయం నుంచి రోగాలు తగ్గటానికి - వుద్యోగాలు రావటానికి- సంతానం కల్గటానికి- పరీక్షలు ప్యాసవ్వటానికి- యింకా ఎన్నో వివరాలు యిచ్చేసి యిప్పుడే కొస్త విశ్రమించారు. వెళ్ళు వెళ్ళు' అన్నాడు గణాచారి వ్యంగ్యంగా.

పోలిగాడు అచేతనంగా నిలబడిపోయాడు.

"అంత భక్తేవుంటే ఆ టెంకాయ అక్కడే



కొట్టెయ్. దేముడు ఎక్కడ మాత్రం లేడు? ఈ మాత్రానికి వేసిన తలుపులు తీయడం దేనికి? నా కవతల పనుంది" అంటూ వడి వడిగా యింటివైపు నడిచాడు గణాచారి.

రెండు మెతుకులు తిని బట్టలు చేతి సంచిలో సర్దుకున్నాడు.

ఎందుకైనా మంచిదని ఒక ఐదు వందలు రొఖ్ఖం విడిగా ఒక కవర్లో పెట్టి సంచి అడుగున దాచాడు.

ఈ రోజుల్లో మరి డబ్బుతోటిదే కదా ఏ పనైనా!

ఆ రోజు ప్రెసిడెంట్‌గారు హైదరాబాద్ వెళ్ళబోతున్నారు. ప్రెసిడెంటు ఆలయానికి ధర్మకర్తలు: బోర్డు పలుకుబడి వున్న మనిషి.

ఆయనతో చదువుతూ ఒకే కంచంలో తిని ఎమ్. ఎల్. ఏలు, ఒకే మంచం మీద పడుకున్న మినిష్టర్లు వున్నారుట పట్నంలో.

అందుకే గణాచారి ఆయన్ను ఆశ్రయించాడు.

ప్రెసిడెంటుగారు అభయ హస్తం యిచ్చేశారు.

అసలు సంగతి!

గణాచారి కొడుక్కి హైదరాబాదులో ఒక వుద్యోగానికి యింటర్‌వ్యూ వచ్చింది,

కొడుకు తనలా పూజారి కాకూడదని తండ్రి ఆశయం. ఏదైనా మంచి సర్కారు వుద్యోగం చెయ్యాలని వాంఛ.

ఆ రాత్రికే ప్రెసిడెంట్‌గారితో హైదరాబాద్ వెళ్ళే బస్సెక్కాడు గణాచారి.

* * *

పది రోజులు యిట్టే గడిచాయి.

గణాచారి యాంత్రికంగా తన విధులు నిర్వహిస్తున్నాడు. మనస్సు మాత్రం కొడుక్కి రాబోయే వుద్యోగం మీదే వుంది.

గణాచారి కొడుకు ఆ రోజే పట్నం నుంచి తిరిగి వచ్చాడు.

ఉద్యోగం రాలేదు. కొడుకు చెప్పిన వార్త విని ఖిన్నుడైపోయాడు గణాచారి.

ప్రెసిడెంట్‌గారి కంచంలో తిన్న ఎం. ఎల్. ఏ. మంచంలో పడుకున్న మినిష్టరూ ఎవ్వరూ ఏం చెయ్యలేక పోయారా?

'అంతా మన తల రాత. ఈశ్వరేచ్ఛ మరోలా వుంది' అనుకున్నాడు.

చివరి మాట అంటూ గతుక్కుమన్నాడు గణాచారి.

ఎంత పొరపాటు చేశాడు?

వడి వడిగా గుడి వైపు నడిచాడు.

అక్కడ కనబడ్డ దృశ్యం చూసి ఒక క్షణం ఆశ్చర్యంగా నిలబడిపోయాడు.

పోలిగాడు, వాడి కొడుకూ, మోచేతులు-మోకాళ్ళ మీద ప్రాకుతూ గుడి చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నారు.

"పోలిగా, ఏంటి సంగతి?" కుతూహలంగా అడిగాడు.

"ఏం లేదు సామి, దేముడు మా మొరిన్నాడు. అబ్బాయికి వుద్యోగం వచ్చింది, అందుకే మొక్కుబడి తీర్చుకుంటున్నాం" అన్నాడు.




గణాచారి క్షణం సిగ్గుపడ్డాడు.

ప్రతి నిత్యం స్వామి వారి సేవలో వుంటూ, కోర్కెలు కోర వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదా లిస్తూ, భగవంతుడి మహిమలు కథలుగా, గానాలుగా వినిపించే తాను ఏం చేశాడు? స్వామి వారిని నమ్మలేక మానవమాత్రుల వెంటపడ్డాడు.

"నా భక్తుల బాగోగులు చూసే బాధ్యత నాది" అని గీతలో భగవంతుడే చెప్పాడు.

"స్వామీ! క్షమించు. అత్యంత సన్నిహితుడవి, సమర్థుడవి అయిన నిన్ను ఉపేక్షించి ఎండమావుల వెంట పడిపోయా. మూర్ఖుడని" లెంపలు వేసుకున్నాడు.

పోలిగాడూ, కొడుకూ ప్రదక్షిణలు పూర్తి చేసి నిలబడ్డారు.

"రా పోలి! గుడి తలుపులు తెరుస్తా. దేవుడిని దర్శించుకుని పోదుగాని" అన్నాడు గణాచారి.

"వద్దులే సామి. ఆ రోజు మీరు చెప్పిందే నిజం. దేవుడెక్కడ మాత్రం లేడు? కావల్సింది భక్తి. నమ్మకం. అవి వుంటే గుడి తలుపులు అడ్డు రావ్" అంటూ టెంకాయ మండపంలోనే కొట్టి వెళ్ళిపోయాడు పోలిగాడు.

దూరమవుతున్న మూఢుడనుకున్న పోలిగాడు ఒక పెద్ద జ్ఞానిలా కనబడ్డాడు గణాచారికి. □